నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

1

మెదక్

గురువారం | 11 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

వరి ధాన్యం సేకరణ కంట్రోల్ రూం ప్రారంభం

నవతెలంగాణ-సంగారెడ్డి

రబీ (యాసంగి) వరి ధాన్యం సేకరణ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతి వల్లూరు బుధవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా కంట్రోల్ రూమ్ ఫోన్ 08455-276155ను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి. డీఎస్ఓ వనజాత,డిఎం మేనేజర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



శిశు గృహ, సఖి సెంటర్‌లో జె. హనుమంతరావు ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-సంగారెడ్డి



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు ఆదేశాల ప్రకారం బుధవారం స్థానిక శిశు గృహ, సఖి సెంటర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పిల్లల బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలియజేశారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాన్నారు. వేసవి కాలం యొక్క జాగ్రత్తలను కూడా పాటించాలన్నారు. న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరితే.. న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించాలన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరూ దొంగలే

- బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భూ బకాసురుడు
- బీఆర్ఎస్ హయాంలో రాక్షస పాలనను ప్రజలు ఇంకా మర్చిపోలేదు
- కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి...
- సమావేశంలో ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

నవతెలంగాణ-రామచంద్రాపురం



బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిలిద్దరూ దొంగలే అని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి, మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి కొండా సురేఖ విమర్శించారు. రామచంద్రాపురంలోని శ్రీ కన్వెన్షన్‌హాల్‌లో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ ఎన్నిక సన్నాహక సమావేశాన్ని ఎన్ఎస్‌యూఐ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొండా సురేఖ, ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూర్ వెంకట్, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, సంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి,పటాన్చెరు ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, దుబ్బాక ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వెంకట్రామిరెడ్డి ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడి, పేదల పొట్టలు కొట్టాడన్నారు. కేసీఆర్ పాలనలో వెంకట్రామిరెడ్డి కోట్ల రూపాయలు దండుకున్నాడన్నారు. కేవలం వారి నేతలకు, నాయకులకు మాత్రమే పథకాలు, పనులు లాంటివి చేసి దుర్మార్గపు రాక్షస పాలనను బీఆర్ఎస్ కొనసాగించిందని ఆరోపించారు. ప్రాజెక్టుల్లో సరైన విధంగా నీళ్లు నింపి, సక్రమమైన పరిపాలన కొనసాగిస్తే.. ఈరోజు ఈ దుస్థితి ఉండేది కాదన్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన దేవాదుల, ఎస్సారెస్పీ, శ్రీశైలం డ్యాముల వల్లే జిల్లాల్లో పంటలు పండుతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గత పాలకులు చేయనటువంటి పనులు ఈ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలను ఇంటింటికి తీసుకుపోయి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకులకు సురేఖ సూచించారు. అలాగే ఈ ఎంపీ ఎన్నికలే నాయకుల భవిష్యత్తును డిక్లేర్ చేస్తాయన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు.

సైనికుల్లా పనిచేసి నీలం మధుని గెలిపించాలి..

కాంగ్రెస్ జెండా కింద ఉన్న ప్రతి ఒక్కరూ సైనికుల వలె పనిచేసి మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును గెలిపి ంచాలని ఎమ్మెల్సీ, ఎన్ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. మెదక్ నుంచి బీఆర్ఎస్, బిజెపి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇద్దరు ఒకటేనని అన్నా రు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు కలిసి వచ్చేందుకు ఉద్దేశపూర్వకంగానే వెంకట్రామిరెడ్డిని బీఆర్ఎస్ బరిలో ఉంచిందన్నారు. ఇరు పార్టీల మధ్య ఒప్పందం ఎప్పటి నుంచో కొనసాగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నటువంటి గ్యారెంటీలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. యువ నేతకు అవకాశం వచ్చినందున అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత కూడా తమపై ఉందన్నారు.

గెలిపించండి.. రుణం తీర్చుకుంటా..

ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఈ మెదక్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లి.. ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఒకనాడు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఇందిరమ్మ ప్రధాని అయి ఈ ప్రాంతానికి ఎంతో చేశారన్నారు. బీడీఎల్ , బిహెచ్ఎల్ తోపాటు అనేక కర్మాగా రాలు ఇతరత్రా మౌలిక వసతులను ఇందిరాగాంధీ కల్పించి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు గెలిస్తే గేటెడ్ కమ్యూనిటీలో ఉంటారని, తనను గెలిపిస్తే ప్రజల్లోనే ఉండి సేవ చేస్తానన్నారు. డిస్టిక్ ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ కొల్మూరి నరసింహారెడ్డి, అసెంబ్లీ ఇంచార్జ్ వినయ్ గౌడ్, చెరకు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ రవీందర్ గౌడ్, బొల్లారం మున్సిపల్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్, పీసీసీ మెంబ ర్లు, బ్లాక్ కాంగ్రెస్, మండల ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు శ్రీశైలం,రవీందర్,నారాయణ రెడ్డి, ఎన్ఎస్ యుఐ సభ్యులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, మహిళా కాంగ్రెస్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలోని వెంకట కాజా ఆశ్రమంలో గల ఫంక్షన్ హాల్‌లో ముస్లింల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలుభక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాసాలు ఉండి భగవంతున్ని స్మరించుకుంటారన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ మరోమారు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా రెండేండ్లకు పైబడి మూతబడిన పెట్రోల్ పంపు తిరిగి పున: ప్రారంభం కావడంతో ఇక్కడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పెట్రోల్ పంపు యజమాన్యం ఏర్పాటుచేసిన ఆదిత్యాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరము లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ పెద్దన్న ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహకు పెట్రోల్ పంప్ ఆవరణలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రమేష్ జోషి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ భర్త పత్రి శ్రీకాంత్, రేగోడ్ జెడ్పీటీసీ రాజేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు కాజా మోహిన్, మాజీ ఎంపీపీ పత్రివిటల్, వట్పల్లి మాజీ సర్పంచ్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

నవతెలంగాణ-సంగారెడ్డి



రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జిల్లాలోని ముస్లిమ్ సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర మాసమైన రంజాన్‌లో నెలరోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి అల్లాను ప్రార్థించారన్నారు. నెలవంకతో రంజాన్ దీక్షలు ప్రారంభమై మళ్ళీ నెల వంకతో రంజాన్ పండుగను జరుపుకుంటారని, ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ముస్లిమ్ సోదరులు, సోదరీమణులు అనందోత్సవలతో, భక్తి శ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆ అల్లా దీవెనలు ఎప్పుడూ అందరి పై ఉండాలని ఆకాక్షించారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలతో రంజాన్ మాసం శాంతి, ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుత ుంద న్నారు.పండుగను భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహలతో జరుపుకోవాన్నారు.

నేడే రంజాన్ పండుగ..

నవతెలంగాణ-పుల్కల్



రంజాన్ నెల ప్రారంభం నుంచి 30 రోజులపాటు ముస్లిం సోదరులు కఠోర ఉపవాస దీక్షలు చేశారు. ఈ ఉపవాస దీక్షలు బుధవారంతో ముగిశాయి. నేడే(గురువారం) రంజాన్ పర్వదినాన్ని నిర్వహించనుండడంతో.. ముస్లిం మైనార్టీ సోదరులు చిన్న పెద్ద తేడా లేకుండా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు. ప్రార్థన చేసే ఈద్గాలను గత వారం రోజులుగా ముస్తాబు చేశారు. ముఖ్యంగా పుల్కల్ మండల కేంద్రంలో దాతల సహకారంతో సుమారు రూ.1,50,000తో ఈద్గాకు నాలుగు వైపులా మినార్‌లను పుల్కల్ మస్జిద్ మాజీ పండితులైన ఏ తేశం ఖాన్ సహాయ సహకారాలతో సుందరంగా ముస్తాబు చేశారు. నేడు జరగబోయే రంజాన్ వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడమే కాకుండా ప్రార్థనా గ్రామ మైనార్టీ సోదరులు ఆ స్థలాన్ని పూర్తిగా శుభ్రపరచి తయారు చేశారు. ఈ ఏర్పాట్లు చేయడంలో మాజీ పంతులైన ఎతే శ్యామ్ ఖాన్ ఎంతగానో శ్రమించారు. ప్రార్థన స్థలం వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా పుల్కల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పుల్కల్ ఎస్సై శ్రీకాంత్ సూచించారు.

తాగునీటి సమస్యల నివారణా చర్యలు చేపట్టాలి

- సిఎంఆర్ రోజూవారీ లక్ష్యాలను పూర్తి చేయాలి
- వడదెబ్బపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-సంగారెడ్డి



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల నివారణా చర్యలు చేపట్టాలినీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో తాగునీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి నుంచి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, మాధురి (రెవెన్యూ) సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందించే వనరులను గుర్తించి ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తిచేయాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం తాగునీటి సరఫరా చేయా లన్నారు. సిఎంఆర్ రోజూవారీ లక్ష్యాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకో వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన మౌలిక వసతుల పనులు వచ్చే విద్యా సంవత్సరం లోపు పూర్తవ్వాలని పేర్కొన్నారు. వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్సీ కేంద్రాలు, సబ్ సెంటర్ లలో ఔషధ నిల్వలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరిపడా అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఓ సాయిబాబా, డీసీఎస్ఓ వనజాత, డీఏఓ నరసింహ, డీఆర్డీఏ జ్యోతి, డీఎం సివిల్ సప్లై కొండల్‌రావు డిఎంహెచ్ఓ గాయత్రీ, డీఈఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ్ ఈఈ రఘువీర్, ఈఈ పీఆర్ జగదీష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఓ వైపు నీటి కష్టాలు.. మరోవైపు నీటి లీకేజీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు నీటి పైపుల లీకేజీలతో నీళ్లు రోడ్డు పాలు అవుతున్నాయి. ఎస్సీ కాలనీ నుంచి హనుమాన్ టెంపుల్‌కు వెళ్లే రోడ్డులో నీటి పైపులు లీకేజీ అవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి నీటి పైపులు లీకేజీ అరికట్టి తమ దాహార్తిని తీర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



సామాజిక ఉద్యమాలను బలపరుద్దాం

నవతెలంగాణ-పటాన్‌చెరు

సామాజిక ఉద్యమాలను బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని కిర్బీ యూనియన్ నాయకులు మల్లేష్, లఖాన్, మహేశ్వర్‌రెడ్డి, జైపాల్, బిలాల్‌లు అన్నారు. మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల కిర్బీ పరిశ్రమలో బుధవారం సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో సామాజిక సంఘీభావ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనుషులంతా ఒకటేన ని అందరం గుర్తు పెట్టుకోవాల న్నారు. కుల వివక్షత పాటించొద్దని, సామాజిక న్యాయం కోసం అందరం పోరాడాలని, సమానత్వం కోసం అందరు నిలబడాలని కోరారు. సామాజిక ఉద్యమాలను బలోపేతం చేయడం కోసం కార్మికుల దగ్గర నిధి వసూలు చేయడం జరుగుతున్నద న్నారు. వసూలు చేసిన నిధిని ఆయా రాష్ట్ర నాయకులకు అందజేసామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా సహపంక్తి భోజనాలు

- కుల వివక్షతను అంతం చేస్తేనే సామాజిక న్యాయం అందుతుంది : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్

నవతెలంగాణ-సంగారెడ్డి



మహనీయులు భారత రాజ్యాంగ నిర్మిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14, సామాజికవేత్త మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఏప్రిల్ 11, కార్మికోద్యమ నేత బిటి రణదీవే జయంతి ఏప్రిల్6న పురస్కరించుకొని ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించాలనే సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం చౌటకూర్ మండలం అంగడిపేట గ్రామంలో సిబిఎల్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా బుధవారం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్ హాజరై మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వివక్షతను అంతం చేయకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని అన్నారు. పాలకుల విధానాలతో కుల వివక్షతను పెంచే విధంగా ఉన్నాయని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మనువాద విధానాలతో కార్మిక వర్గానికి తీవ్రం నష్టమన్నారు. కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. నేటికీ కులం పేరుతో అవమానాలు, దాడులు సమాజంలో జరుగుతూనే ఉన్నాయన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాం గంపై మనువాదులు దాడి చేస్తున్నారన్నారు. మనువాదాన్ని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ మాట్లాడుతూ.. కార్మిక వర్గ హక్కుల కోసం పోరాటం చేస్తూనే సమాజంలో నెలకొన్న దుర్మార్గమైన కుల వివక్షతను అంతమందించేందుకు సీఐటీయూ కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ వ్యవస్థ భారత దేశంలో మాత్రమే ఉన్నదన్నారు. శ్రమదోపిడితోపాటు సామాజిక దోపిడి కూడా కొనసాగుతున్నదన్నారు. మహనీయులు అంబేద్కర్, పూలే,బిటి రణదీవే, కారల్ మార్క్స్ స్ఫూర్తితో కుల వివక్షతను కూకటి వేళ్లతో పెకిలించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.బాగారెడ్డి మాట్లాడుతూ.. కార్మిక వర్గం ఐక్యం చేస్తూ సమాజంలో నెలకొన్న కుల వివక్షతను ఎంతమందించడానికి సీఐటీయూ నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగానే సహపంక్తి భోజనాలను ప్రతి సంవత్సరం మహనీయుల మాసంలో నిర్వహిస్తున్నామన్నారు. సిబిఎల్ యూనియన్ తరపున సామాజిక ఉద్యమాలకు ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, అంగడిపేట సర్పంచ్ శ్రీను, ఎంపిటిసి మల్లమ్మ, ఉప సర్పంచ్ బీరప్ప, యూనియన్ జనరల్ సెక్రెటరీ ప్రసన్న, యూనియన్ ఆఫీస్ బేరర్స్ దేవరాజ్, నాగభూషణం, విట్టల్, మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకులు సురేష్ డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీశైలం, సహపంక్తి భోజనం కార్యక్రమం దాత సత్యనారాయణ, యూనియన్ నాయకులు లక్ష్మణ్, శ్రావణ్, మహేష్, కేవీపీఎస్ మండలాధ్యక్షుడు రాజు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేసవికాలంలో నాటే పంటల గురించి అవగాహన

నవతెలంగాణ-జహీరాబాద్

న్యాల్కల్ మండలంలోని శంషాల్లాపూర్, టేకుర్, వడ్డీ, మల్గి, హుసేల్లి గ్రామాలకు చెందిన రైతులకు ఎండాకాలంలో పంట పొలాల్లో చేపట్టాల్సిన పనులు,మట్టి పరీక్ష, సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీ గురించి డీడీఎస్ మరియు కె.వి.కె. ఆధ్వర్యంలో భూసార నిపుణులు స్వామి శిక్షణ కల్పించారు. ప్రస్తుతం పొలాల్లో పంటలు ఉండవు కాబట్టి.. మట్టి తీయడానికి అనుగుణంగా ఉంటుందన్నారు. పొలంలో మట్టిని సేకరించే విధానం, మట్టి పరీక్ష ప్రాముఖ్యత, భూసారా పరీక్ష కార్డుల అనుసరించి ఎరువులు వేయడం వలన కలిగే లాభాల గురించి క్లుప్తంగా వివరించారు. వి. రమేష్(పంటల సేద్య శాస్త్రవేత్త) సేంద్రియ ఎరువులైన పంచగవ్య, ఘన జీవామృతం మరియు ద్రవ జీవామృతం రైతులకు ఎలా చేసుకోవాలని ప్రదర్శించి వాటి ఉపయోగాలను వాడే విధానం గురించి క్లుప్తంగా తెలిపారు. డా. ఎన్. స్నేహలత (సస్యరక్షణ శాస్త్రవేత్త) పంటలపై వచ్చే చీడపీడల గురించి వివరించి, పర్యావరణంలో దొరికే ఆకు లతో దశపర్ని కషాయం, బ్రహ్మాస్త్రం, పుల్లటి మజ్జిగ తయారీలపై ప్రదర్శించి వాటి ఉపయోగాలను వాడే విధానం గురించి వివరించారు. ఇందులో భాగంగా డీడీఎస్ సూపర్వైజర్ వినయ్ కుమార్, శంషాల్లాపూర్, వడ్డీ, హుసేల్లి, మల్గి, గుంజోటి, టేకూరు కు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

రూ.21 వేలు విరాళం అందించిన కౌన్సిలర్ నాగరాజ్



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణానికి జోగిపేట మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ కొరబోయిన నాగరాజ్ రూ.21 వేలు విరాళం అందించారు. బుధవారం జోగిపేటలోని ఆయన నివాసంలో ఆలయ నిర్వాహకులు పద్మనాభ రెడ్డి, తదితరులకు అందజేశారు.

గీతం స్కాలర్ అనుపమకు పీహెచ్‌డీ

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని ఎన్.అనుపమ డాక్టరేట్‌కు అర్హత సాధించింది. 'తరగతి అసమతుల్యత డేటా స్ట్రీమ్లలో సమర్థవంతమైన అభ్యాసం కోసం నూతన అల్గారిథమిక్ విధానం' అనే అంశ ంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పిం చారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీ రింగ్ విభాగం ప్రొఫెసర్ వడలి రవిశంకర్ బుధవారం విడు దల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డేటా స్ట్రీమ్లలో తరగతి అసమతుల్యత సవాలు సమస్యను పరిష్కరించడంపై ఈ పరిశోధన దృష్టి సారించిందని, ఇది మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ రంగంలో కీలకమైన అంశమని తెలిపారు. స్ట్రీమింగ్ డేటా దృశ్యాల్లో ఎదురయ్యే తరగతి అసమతుల్యత సమస్యలను తగ్గించడానికి ఆమె అధ్యయనం వినూత్న అల్గారిథమిక్ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ప్రయత్నించిందన్నారు. ఖచ్చితమైన పరిశోధన, ప్రయోగాల ద్వారా, అనుపమ IOSDS, IFSDS, IUSDS, and MOISDS అనే నాలుగు నూతన పద్ధతులను పరిచయం చేసిందని, ప్రతి ఒక్కటీ డేటా స్ట్రీమ్లలో తరగతి అసమతు ల్యతలను సమర్థంగా నిర్వహిం చడంలో మంచి ఫలితాలను అందిస్తోందని డాక్టర్ రవిశంకర్ వివరించారు. అనుపమ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హై దరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ వీఆర్.శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ మహబూబ్ బాషా షేక్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

ఫూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



మహనీయులు మహాత్మా పూలే, బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షులు రాహుల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, మహిళ జాతి విముక్తి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి పూలే అని, అదే విధంగా కుల వివక్ష అంటరానితనంపై, అసమానతలపై పెద్ద ఎత్తున పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. ప్రతీ ఒక్కరు భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రామాల్లో, పట్టణాల్లో మహనీయుల జయంతి ఉత్సవాలను అన్నివర్గాల ప్రజలు, యువత పెద్ద ఎత్తున నిర్వహించి వారి అడుగుజాడల్లో నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు అఖిల్, రఘు, శేఖర్,రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలివ్వాలి

- మల్టీపర్పస్ వర్క్ విధానాన్ని రద్దు చేయాలి
- సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య

నవతెలంగాణ-సంగారెడ్డి



గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్క్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో డీపీఓకి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కోశాధికారి కే.రాజయ్య మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గత 6 నెలల నుంచి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఆరు నెలల నుంచి వేతనాలు లేకపోవడం వల్ల పంచాయతీ కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలన్నారు. మల్టీపర్పస్ వర్క్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. పంచా యతీ కార్మికులను జనాభా ప్రాతిపదికన కాకుండా అవసర ప్రాతిపదికన నియమించాలని కోరారు. పస్తులతో విధులు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీ ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కనీస వేతనం అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బాబురావు,పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దశరథ్, సత్తయ్య, జిల్లా నాయకులు వెంకయ్య, రాజు, శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కొండాపూర్



ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు మోహన్‌రాజ్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలంలోని తేర్పోల్, ఎదురు గూడెం గ్రామాల్లో నూతన అంబేద్కర్ యువజన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జే.వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా పి.ఆనందం, ప్రధాన కార్యదర్శిగా పి.దుర్గయ్య, కార్యదర్శులు పి.ప్రభు, జె.సాగర్, కోశాధికారిగా పి.ప్రవీణ్, కుమార్, ఆర్గనైజ్ సెక్రెటరీగా జే.రాహుల్ మరియు గౌరవ సభ్యులుగా ఎం.నవీన్, జి.సాయి యాదవ్, పి.సురేష్, జి.అర్జున్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెరువుల్లో ఈత కొట్టుట నిషేధం



నవతెలంగాణ-ఝరాసంగం

చెరువుల్లో చిన్నపిల్లలు ఈత కొట్టడం, చేపలు పట్టడం, బోటింగ్ నిషేధమని స్థానిక ఎస్ఐ రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఝరాసంగం మండల పరిధిలోని జీర్లపల్లి, ఏడాకులపల్లి, చిలేపల్లి గ్రామ శివారులోని చెరువు కట్టలపై హెచ్చరిక బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. స్కూల్ విద్యార్థులకు వేసవి సెలవులు రావడం వలన చెరువులలో ఈత కొట్టేందుకు వెళ్ళొద్దన్నారు. చెరువులు లోతు ఎక్కువగా ఉండటం వలన నీటిలో మునిగిపోయి ప్రాణపాయం జరగవచ్చని, అందులో చెడు బ్యాక్టీరియా ఉండడం వల్ల చర్మవ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈత కొట్టే సమయంలో రాళ్ళల్లో ఇరుక్కొని ప్రమాదం జరగవచ్చని అందుకే చెరువులల్లో ఈత కొట్టడం నిషేధమన్నారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన బాపల్లి బాలమణికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.16,500 మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును బాధితురాలి మామ శంకర్ గొండాకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆయన స్వగృహంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాటాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో బాలమని సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా ఆ డబ్బులు ఇప్పుడు మంజూరయ్యాయన్నారు. ఆ చెక్కును లబ్దిదారులకు అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క చెక్కు కూడా ఇవ్వలేదని విమర్శించారు. వారితోపాటు ఎంపీటీసీ అంజయ్య సాగర్, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, యువ నాయకులు ప్రశాంత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పాల పొంగులా కాంగ్రెస్ పాలన

- అభయ హస్తం కాదు.. శూన్య హస్తం
- ముఖ్యమంత్రివా.. చెడ్డి గ్యాంగ్ సభ్యుడివా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆరు గ్యారంటీలు అంటూ.. అభయ హస్తం అంటూ అధికారంలోకి వొచ్చిన రేవంత్ సర్కార్ ప్రజలకు శూన్యహస్తం అందించిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గ్రామంలోని గణేష్ గడ్డ దేవాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డిలతో కలిసి ప్రచార రథాలకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఆచరణ సాధ్యం కాని, అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మార్పు.. మార్పు అని ఉన్న సంక్షేమ పథకాలకు కోత పెట్టారన్నారు. పాల పొంగులా కాంగ్రెస్ పాలన అసలు స్వరూపం భయట పడిందన్నారు. 6 గ్యారంటీల కోసం రాహుల్, ఏఐసీసీ మాట అన్నారని.. 120 రోజులు గడుస్తున్నా అమలు కు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. మహాలక్ష్మి పథకంలో 18 ఏళ్ళు నిండిన మహిళలకు నెలకు 25 వేలు ఇస్తామన్నారని.. రాష్ట్రంలో ఉన్న 1.42 కోట్ల మంది మహిళలకు కాంగ్రెస్ బాకీ పడిందన్నారు. 42 లక్షల పింఛన్ దారులు ఉన్నారని వారికి నెలకు 4వేలు ఎప్పుడిస్తారో చెప్పాలని నిలదీశారు. నాడు నిరుద్యోగ భృతి ఇస్తామని రాహుల్, ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డిలు మాట్లాడారని.. కానీ నేడు తోక ముడిచారన్నారు. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పూసే లేదని, కేసీఆర్ కిట్ బంద్ అయిందన్నారు. కళ్యాణ లక్ష్మికి తులం బంగారం, వడ్లకు బోనస్ 500 ఏమాయే అని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామరెడ్డి లోకల్ అని.. తెల్లాపూర్ లో నివాసం ఉంటున్నాడన్నారు. 11 ఏళ్ళ పాటు ఉమ్మడి మెదక్ జిల్లా లో పనిచేసిన విద్యావంతుడైన ఆయన్ను గెలిపిస్తే.. సంగారెడ్డి ప్రాంత సమస్యలపైన పార్లమెంటులో తెలంగాణ గళం వినిపిస్తాడన్నారు. దుబ్బాకకు చెందిన అనాథ పిల్లలు సహాయం కోసం వొస్తే వెంకట్రామిరెడ్డి ఆదుకున్నాడని.. ధనంతో పాటు దాన గుణం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఎన్నికల్లో గెలిస్తే రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి.. పేదలకు నాణ్యమైన విద్యం అందించేలా కృషి చేస్తానని హామీ కూడా ఇచ్చాడన్నారు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో తప్పకుండా ఆయన్నే భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. దుబ్బాకలో ఎడ్లు నాగలి, నిరుద్యోగ భృతి, దుబ్బాకకు రైలు బండి అని హామీలు ఇచ్చి మోసం చేసిన రఘునందన్‌రావును అక్కడ చిత్తుగా ఓడించారని.. అక్కడ చెల్లని వ్యక్తి పటాన్‌చెరులో ఎలా చెల్లుతాడన్నారు. గణేష్ గడ్డ మనకు అచ్చొచ్చిన గడ్డ అని.. ఇక్కడ 3 సార్లు ఎమ్మెల్యే ఎన్నికల్లో మహిపాల్ రెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, వాహన పూజకు జెండా ఊపడం జరిగిందని.. ఘన విజయం కూడా సాధించామని గుర్తు చేశారు.

మినీ ఇండియాలో భారీ మెజారిటీ అందిస్తాం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

మినీ ఇండియాగా పేరుగాంచిన పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డికి భారీ మెజారిటీ అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరులో 6 లక్షల ఓట్లు ఉన్నాయని.. మెజారిటీ ఓట్లు రావడం ఖాయమన్నారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ఈనెల 13న సాయంత్రం 4గంటలకు జీఎంఆర్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని.. పెద్ద ఎత్తున పాల్గొని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నన్ను ఆశీర్వదించండి.. అండగా ఉంటా
- మెదక్ ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డి

కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌గా 11 ఏళ్ళు మీలో ఒకరిగా మీతో కలిసి పనిచేశానని, ఎంపీ అభ్యర్థిగా ప్రజా సేవకోసమే వస్తున్నానని పెద్ద మనసుతో ఆశీర్వదించాలని అండగా ఉంటానని ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి వెంకట్రామిరెడ్డి అభ్యర్థించారు. తాను పటాన్‌చెరు నియోజక వర్గంలోని తెల్లాపూర్ వాసినని, ఏ కష్టం వొచ్చినా పిలవగానే వొచ్చి అండగా నిలుస్తానన్నారు. ట్రస్టు ద్వారా నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జహీరాబాద్

కరెంట్ డిపార్ట్మెంట్ మోహన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో క్షతగ్రతులై హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెల్సుకున్న శాసనసభ్యులు కొనింటి మాణిక్‌రావు ఆసుపత్రికి చేరుకుని.. ఆయన ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు బాధితుడి కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి చిహ్నమన్నారు. సేవా దృక్పథాన్ని, సోదర భావాన్ని, మత సామరస్యాన్ని చాటి చెప్పే రంజాన్ పర్వదిమాన్ని ముస్లిం సోదరులు సంతోషంగా ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని కోరారు.



బీఆర్ఎస్‌లోకి వికలాంగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని మార్డి గ్రామానికి చెందిన వికలాంగుల సంఘం అధ్యక్షులు కుమ్మరి శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లేనిపోని అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క హామీ కూడా సరిగ్గా నెరవేర్చలేదన్నారు. 6 గ్యారంటీలు అని చెప్పి ఓన్లీ మహిళలకు బస్సు ఫ్రీ అంతంత మాత్రమే కొనసాగిస్తూ మిగతా ఐదు గ్యారెంటీలను గాలికి వదిలేశారన్నారు. గ్రామాలలో ప్రజలు రైతులు యువకులు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామా అని బాధపడుతున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజయ్య సాగర్,మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు సుధాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణయ్య, మాజీ వార్డ్ మెంబర్ బాలరాజు, నాయకులు వడ్ల వెంకట్, బషీర్, ఎరుకల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సప్తహ ముగింపు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని కృష్ణాపూర్ గ్రామంలో సప్తహ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని.. పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ అంతర్గం, మహారాజును మాజీ ఎమ్మెల్యే ఒకరు నొకరు శాలువాలతో సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, ఎంపీపీ సుశీల అంజయ్య, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ అంజయ్య సాగర్, పిఎసిఎస్ చైర్మన్ కృష్ణాగౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాములు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ..

సిర్గాపూర్ మండలంలోని పొట్‌పల్లి గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపీపీ మాధవరావు పటేల్ పెద్దమ్మ లక్ష్మీబాయి, వాసర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహమ్మద్ అఖ్తర్ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మండల జడ్పిటిసి రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సంజీవరావు పాటిల్, మాజీ సర్పంచ్ వెంకట్రావు, నాయకులు యాదవ రావు పాటిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16న అందోల్ లో కేసీఆర్ బహిరంగ సభ

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



నవతెలంగాణ-జోగిపేట

ఈనెల 16న అందోల్ నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్పూర్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఉంటుందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తెలిపారు. ఈ బహిరంగ సభకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అంతకుముందు పార్టీ నాయకులతో కలిసి సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని పటాన్చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాలను కలిపి ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సభకు సుమారుగా 1.50 లక్షల మందిని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా అందోల్ నియోజకవర్గం నుంచి సుమారుగా 25 వేల మందిని తరలిస్తామన్నారు. బహిరంగ సభకు సంబంధించి నియోజకవర్గ పరిధిలోని మండలాల ముఖ్య నాయకులతో సమావేశాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. జహీరాబాద్ పార్లమెంటు అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలుపునకు బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు బాలయ్య, జైపాల్ రెడ్డి, రామ గౌడ్, సాయికుమార్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, బస్వరాజ్ పాటిల్, లక్ష్మీకాంత రెడ్డి, వీరారెడ్డి, విజయ్ కుమార్, విఠల్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, విజయ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పీసీబీ అధికారుల తనిఖీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం పారిశ్రామికవాడలోని సూర్యచంద్ర మినరల్స్ పరిశ్రమలో పీసీబీ అసిస్టెంట్ పర్యావరణ ఇంజనీరు అజయ్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. రాత్రి సమయంలో డస్ట్ పొల్యూషన్‌తో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఫిర్యాదులపై ఈ తనిఖీ చేపట్టారు. పరిశ్రమ తీరును స్వయంగా పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

- మైనింగ్, తహసీల్దార్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- అక్రమమైన వందల ట్రిప్పుల ఎర్రమట్టిని సీజ్ చేయాలి
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి



నవతెలంగాణ-కొండాపూర్

కొండాపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా వెలసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్‌కు సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎం. నర్సిములు, మండల కార్యదర్శి కె.రాజయ్య మాట్లాడుతూ.. కొండాపూర్ మండలం మన్సాన్‌పల్లి గ్రామ శివారులో గల 187, 188, 189 సర్వే నెంబర్లలో 27 ఎకరాల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ఎలాంటి పర్మిషన్లు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ వెంచర్ యాజమాన్యం పక్కనే ఉన్న ఇరిగేషన్ కాలువలను కబ్జా చేసి మట్టితో నింపారని.. వెంటనే వారిపై ఇరిగేషన్ యాజమాన్యం చర్యలు తీసుకుని కాలువల మరమ్మత్తులు చేయాలన్నారు. వందల ట్రిప్పుల ఎర్రమట్టిని గుట్టల నుండి తొలిచి వెంచర్లల్లో రోడ్లకు ఉపయోగించుకోవడం కోసం పెద్ద ఎత్తున కుప్పలు వేశారని.. మైనింగ్ అధికారులు వెంచర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోని మట్టిని సీజ్ చేయాలన్నారు. మాచపల్లి గ్రామ క్రీడా ప్రాంగణానికి వెళ్లకుండా బిబిజి వెంచర్ యాజమాన్యం చుట్టూ రోడ్లు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నావ న్నారు. ఇలా అక్రమంగా వెంచర్లు వెలుస్తున్నా, ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నా.. రెవెన్యూ యంత్రాంగం, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు ఎందుకు చూస్తూ ఊరుకుంటున్నారని ప్రశ్నించారు. మునిదేవునిపల్లి గ్రామం 92 సర్వే నెంబర్ నుంచి ఎర్రమట్టిని తరలించి వెంచర్లలో రోడ్ల కోసం ఉపయోగిస్తున్నారని అది వెంటనే నిలిపేయాలన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కాలేజీలో మంగళవారం రాత్రి ఉగాది ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ ఉగాది ఉత్సవాల్లో కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, వివిధ రంగాల్లో సేవలు చేసిన వారికి ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూసల లింగగౌడ్, మాజీ శాసనమండలి సభ్యులు ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉగాది సాంప్రదాయం గురించి వివరించారు. పలు రాష్ట్రాల్లో భారతదేశంలో జరుపుకుంటున్న నూతన సంవత్సరం గురించి తెలిపారు. పండితులు శ్రీ కృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా కవులు, పూర్ణ కృష్ణ, యాదవాచర్యులు, బి.నాగేశ్వర్, రాఘవేందర్ రెడ్డి, మహమ్మద్ షరీఫ్,వడ్ల సాయిలు చారి, రాళ్లబండి బసప్ప, కృష్ణా గౌడ్‌లు కవి సమ్మేళనంలో పాల్గొని పురస్కారాలు అందుకొనగా, వివిధ రంగాల్లో సేవ చేసిన వైజయంతి చక్రవర్తి అధ్యక్షురాలు సంచార భారతి సంగారెడ్డి, సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత ఇ.సాలమన్ రెడ్డి సెయింట్, యోగా గురు సోమలింగం, డాక్టర్ టి జయ నిర్మల, ఎం. సంధ్య, కళింగ కృష్ణకుమార్, జుబేదాబేగం, ఏ. సునీల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమా నికి ఏ.నాగిరెడ్డి రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి అధ్యక్షులు అధ్యక్షత వహించగా కార్యదర్శి ఏ.కిషన్ 2024-25 నివేదికను ప్రవేశపె ట్టారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మంజీరా సంగారెడ్డి ఎలెక్ట్ ప్రెసిడెంట్ గోపన్నగారి చంద్రశేఖర్, ఎలక్ట్రిక్ సెక్రెటరీ నక్క రమేష్, పాస్ట్ ప్రెసిడెంట్ అంజయ్య సభ్యులు మిరియాల పాండురంగం, అంజయ్య, భూమయ్య, డాక్టర్ రాజు గౌడ్, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని గడ్డపోతారానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత మద్దూరు లక్ష్మణరావు బృందం బీజేపీలో చేరినట్టు జిన్నారం బీజేపీ మండలాధ్యక్షులు కొత్తకాపు జగన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నేత ఈటల రాజేందర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కురుపల్లి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి మద్దూరి రాజు, బీసీ మోర్చా అధ్యక్షులు అగ్రారం శెంకర్ మద్దూరి మహేష్, అగ్రారం వెంకటేష్, మద్దూరి లక్ష్మణ్ రావు, శివశంకర్, బాలయ్య, మాణిక్యం, ఓంకార్,యాదగిరి, శ్రీశైలం, శ్రీశైలం, సత్యనారాయణ, శ్రీకాంత్, సూరజ్ పాల్గొన్నారు.

రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణ కోసం పోరాడుదాం



నవతెలంగాణ-సదాశివపేట

రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణ కోసం ప్రతీ ఒక్కరం పోరా డాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్, సామాజిక ఉద్యమ నాయకులు చుక్కల నాగరాజు పిలుపునిచ్చారు. సదాశివపేటలో బుధవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో సామాజిక చైతన్య బైక్ ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ పూలే ఆలోచన విధానంతో ముందుకు పోవాలన్నారు. వారి పోరాట స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే విద్య, మహిళా జాతి విముక్తి కోసం పోరాడిన మహనీయుడన్నారు. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కులవివక్ష అంటరానితనంపై అసమానతలపై పెద్ద ఎత్తున పోరాడాడని.. కాబట్టి ఆ మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. సాటి మనిషిని మనిషిగా చూడలేని మనస్మృతిని మట్టుబెట్టాలన్నారు. మనువాదుల కుట్రల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకుందామని ప్రభుత్వ రంగాన్ని, కాపాడుకోవడం కోసం పోరాటాలు నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి టీ.మల్లేశం, మండల కార్యదర్శి యన్.మహేష్, ఆవాజ్ సంఘం నాయకులు ఖయ్యుమ్, కేవీపీఎస్ నాయకులు బాలరాజ్ రాజేష్,అశ్వక్, ప్రదీప్, నాగరాజు, మోహన్, పవన్, శ్రీకాంత్, రాజు, అనిల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథం పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రుద్రారం గణేష్ గడ్డలో ప్రచార రథానికి నిర్వహించిన పూజా కార్యక్రమానికి బొల్లారం మునిసిపల్ చైర్మెన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వి.హనుమంత్ రెడ్డి (బొల్లారం మునిసిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు) యాది రెడ్డి, బొల్లారం మునిసిపల్ కౌన్సిల్లర్లు వేణుపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రత్నం, బీరప్ప, మన్నే సతీష్, ప్రభు, సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, మాజీ ఎంపీటీసీ నాయుడు, సంతోష్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, శ్రీకాంత్ చారీ (బీఆర్ఎస్ బొల్లారం ప్రెసిడెంట్), ప్రశాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా న్యాల్కల్ జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జహీరాబాద్

న్యాల్కల్ జెడ్పీటీసీ స్వప్న భాస్కర్ జన్మదిన వేడుకలను స్థానిక అతిథి హోటల్లో బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ హాజరై.. పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంజోల్ వైద్యనాథ్, నర్సింహా గౌడ్, న్యాల్కల్ వెంకట్, ప్రవీణ్, అశోక్ పాటిల్, విట్టల్, పరమేష్, నర్సింలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అన్నారం గ్రామ పరిధిలోని 261 ప్రభుత్వ భూమి కేసీఆర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తహసీల్దార్ గంగాభవాని, రెవెన్యూ పంచాయతీ అధికారులు పోలీసులు సహకారంతో జేసీబీలతో కూల్చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని ప్రయత్నించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా.. వాటిని కూల్చివేయడంతో పాటు సంబంధిత కబ్జాదారులపై చట్టరీత్యా క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సంగీత, రెవెన్యూ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పారిశ్రామిక వ్యర్థాలను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

స్పందన

'గుంట్ట లంగా పారిశ్రామిక వ్యర్థాలు.. పట్టించుకోని అధికారులు' అనే శీర్షికన ఈనెల ఏడో తేదీన నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. పారబోసిన పారిశ్రామిక వ్యర్థాలను బుధవారం ఏఈ అజయ్ పరిశీలించారు. శాంపిల్స్ సేకరించి ఏ పరిశ్రమ పారబోసిందో గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.ం౦

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-కొల్చారం

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనాలు అదుపుతప్పి కిందపడిపోయే ప్రమాదం ఉందని, తద్వారా ఎంతో మంది ప్రయాణికులు చనిపోతున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ధాన్యం ఆరబోతలకు కల్లాలను మాత్రమే ఉపయోగించుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దు



నవతెలంగాణ-నిజాంపేట

రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టొద్దని స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం రోడ్డుపై ఆరబెట్టడంవల్ల ప్రతి ఏటా ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడం వల్ల వారి వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. దయచేసి ఇతరులు మీ వల్ల రోడ్డు ప్రమాదానికి గురికాకుండా ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టకండని, రోడ్లపై వరి మక్కలు ఆరబెట్టినచో అట్టి యజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

తగ్గేదేలే పసిడి ధరలు పైపైకి

- తులం బంగారం రూ. 74 వేలు
- త్వరలో రూ. లక్షకు చేరుకునే అవకాశం
- సామాన్యులకు అందనంత దూరంలో బంగారం ధరలు

నవతెలంగాణ-మెదక్

పసిడి ధరలు సామాన్యులకు అందనంత దూరంలో పైపైకి ఎగబాకుతున్నాయి. ప్రతీ ఏటా ఊరిస్తూ ఉసూరుమనిపిస్తూ పసిడి ప్రియులకు చుక్కలు చూపిస్తున్నాయి. గత నాలుగేళ్లలో సుమారు రూ.30 వేలకు పైగా పెరిగిన బంగారం ధరలు తగ్గేదేలే అన్నట్లు దూసుకుపోతుంది. పలుమార్లు పెరుగుతూ వచ్చిన బంగారం తాజాగా ఆదివారం 10 గ్రాముల (తులం) బంగారం ధర రూ. 74 వేలకు చేరుకుంది. అయితే ఈ ధరలు ఇక్కడితో ఆగకుండా మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పసిడిని కొందరు ఇష్టపడితే.. మరికొందరు పసిడితో వ్యాపారం చేస్తుంటారు. వివాహాలు, పండుగలకు ఆకర్షణీయమైన డిజైన్లతో తయారు చేయించుకున్న బంగారు ఆభరణాలను మహిళలు ధరిస్తుంటారు. కాగా ఇటీవల కాలంలో ఆడవారితో పాటు మగవారికి బంగారంపై క్రేజ్ పెరిగింది. ఒంటి మీద ఎంత బంగారం ఉంటే అంత సమాజంలో హోదాకు చిహ్నంగా భావిస్తుంటారు. మరికొందరు స్టాక్ మార్కెట్‌లో బంగారం ధరల హెచ్చుతగ్గులను గమనిస్తూ వ్యాపారం చేస్తుంటారు. బంగారం ధరలు తగ్గినప్పుడు పెట్టుబడి పెట్టి వారి స్థాయిని బట్టి కొనుగోలు చేసి రెట్ అమాంతంగా పెరిగినప్పుడు విక్రయిస్తూ ఆదాయం పొందుతుంటారు. ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న పసిడి సామాన్యులకు అందనంత దూరంలో పరుగులు తీస్తుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది.

తులం బంగారం రూ.లక్షకు చేరుకునే అవకాశం

పసిడి ధరలు మరింత ప్రియమవుతాయని ముందునుంచి ఊహించినట్లుగానే సంకేతాలు కనిపిస్తున్నాయి. కుటుంబ వారసత్వంగా పరిఘనించబడుతున్న బంగారానికి ఏ మాత్రం విలువ తగ్గడం లేదనడంలో అతిశయోక్తి లేదు. బంగారం ధరల హెచ్చుతగ్గులకు అనేక కారణాలు ఉన్నాయని, గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ పెరగడంతో దేశీయ మార్కెట్లలోనూ బంగారం ధరలకు రెక్కలొస్తాయని, రూపాయి మారకం విలువలో మార్పులు, పెట్టుబడులు పెరగడం వంటివి ధరల పెరుగుదలపై ప్రభావం చూపుతాయని విశ్లేషకులు చెప్తున్నారు. 2020 వరకు కాస్త అటూ ఇటూగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు నాలుగేళ్లలో భారీగా పెరిగిపోయాయి. కరోనా ప్రభావంతో పసిడి ధరలు రోజు రోజుకూ పెరుగుతూ వచ్చాయి. నాలుగేళ్ల క్రితం రూ. 40 వేలు ఉన్న పది గ్రాముల బంగారం ధర పెరుగుతూ వచ్చి ప్రస్తుతం రూ. 74 వేలకు చేరుకుంది. అంటే సుమారుగా నాలుగేళ్లలో తులం బంగారానికి సుమారుగా రూ. 30 వేలకు పైగా పెరగడం ఆందోళన కలిగించే అంశంగా చెప్పవచ్చు. ఒకే రోజులో రెండు, మూడు సార్లు ధరలు పెరిగిన పరిస్థితులు ఉన్నాయంటే, మరికొద్ది రోజుల్లో పది గ్రాముల బంగారం ధర లక్షకు చేరుకునే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేయాలా వద్దా అనే భయం సామాన్యుల్లో నెలకొంది. రాబోవు కాలంలో ఏమైనా తగ్గుతుందేమోననే ఆశ కొందరిలో ఉంటే, మరింత పెరిగితే పరిస్థితి ఏంటి అనే భావన ఇంకొందరిలో ఉంది. ఇన్వెస్టర్ల విషయం పక్కన పెడితే పేద, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లల వివాహాలకు బంగారం ఇచ్చే పరిస్థితులు అనుకూలంగా లేవనే చెప్పాలి. బంగారం ధరలను సామాన్యులకు అందుబాటులో ఉంచే విధంగా ధరలను నియంత్రించేలా ప్రభుత్వాలు కృషి చేయాలని పసిడి ప్రియులు కోరుతున్నారు.



బండ పోసాని పల్లి గ్రామంలో వరి పంట కోత ప్రయోగం

- మెదక్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి మాన్య



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధిలోని బండ పోసాని పల్లి గ్రామానికి చెందిన గాంధాల సతీష్ వ్యవసాయ క్షేత్రంలో 185 సర్వేనెంబర్‌లో బుధవారం వరి పంట కోత ప్రయోగం నిర్వహించామని మెదక్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి మాన్య తెలిపారు. వరి పంట కోత ప్రయోగం ద్వారా రైతులకు ఒక ఎకరానికి ఎన్ని క్వింటాళ్ల వరి ధాన్యం వస్తుందని అంచనా వేయడానికి ఈ వరి పంట కోత ప్రయోగం నిర్వహించామన్నారు. ఐదు మీటర్ల పొడవు ఐదు మీటర్ల వెడల్పు 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వరి పంటను కోసి మార్పిడి చేయగా 12.800 కిలో గ్రాముల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. దీనిని బట్టి రైతుకు ఒక ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంకాల అధికారి శ్రీనివాస్ మండల ప్రణాళిక గణాంకాల అధికారి దివ్యభారతి రైతులు పాల్గొన్నారు.

రావి ఆకుపై మసీదును చిత్రించిన చిత్రకారుడు

నవతెలంగాణ-మనోహరాబాద్





మతసామరస్యానికి ప్రతీక ఆయన పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకొని ఓ చిత్రకారుడు రావి ఆకుపై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. తూప్రాన్‌కు చెందిన మేడోజు బ్రహ్మచారి రంజాన్ పండుగ సందర్భంగా రావి ఆకుపై చంద్ర వంక మజీద్‌ను చిత్రీకరించడం జరిగింది. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ నాయకులు

నవతెలంగాణ-మనోహరాబాద్



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తూప్రాన్ మైనార్టీ నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాష్ట్ర మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్ మండల మైనార్టీ నాయకులు బురాన్ ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో గల కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు

సాంస్కృతిక సారథి కళాకారులకు పార్టీ ప్రచార ప్రోగ్రాంలు వద్దు

- స్థానిక నిరుద్యోగ కళాకారులకు ప్రోగ్రామ్స్ ఇవ్వాలి

నవతెలంగాణ-నిజాంపేట



మలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోసిస్తూ కలనే నమ్ముకొని జీవిస్తున్న మాలాంటి కళాకారులకు తెలంగాణ ఏర్పాటు తర్వాత జీవనోపాధి కరువైందని నిరుద్యోగ ఉద్యమ కళాకారుడు వల్లపు స్వామి అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు గౌరవమని చెప్పి సాంస్కృతిక సారథి పేరుతో వాళ్లకు నచ్చిన వారికే ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా 550 మందికి నెలకు రూ.25000 వేతనం ఇస్తున్నారన్నారు. కేవలం వారితోనే సంక్షేమ పథకాలు ప్రచారం చేయిస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలమంది కళాకారుల బతుకులు బజారు పాలు అయినాయన్నారు . బతుకుదెరువు కొరకు ఇక్కడనో అక్కడనో ఏవైనా ప్రైవేట్ ప్రోగ్రాంలు చేసుకొని బతుకుతున్న నిరుద్యగ కళాకారులకు సారథి కళాకారులే పెద్ద శత్రువులుగా మారుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన వేతనం సరిపోలేదన్నట్టు మళ్ళీ ప్రైవేట్ ప్రోగ్రాంలు రాజకీయ పార్టీలు చేసే ప్రచారాల ప్రోగ్రాంలలో కూడా అడ్డు పడి నాయకులతో ఎక్కువ డబ్బులు మాట్లాడుకొని మళ్ళీ నిరుద్యోగ కళాకారులకు కమీషన్‌లకు ఇచ్చి చేయిస్తున్నారన్నారు. అక్కడ వారే ఇక్కడ వారే రికార్డింగ్‌లో వారే ఉండడంతో ఉద్యోగం రాని నిరుద్యోగ కళాకారులు బతకకుండ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి దయచేసి అన్ని రాజకీయ పార్టీల నాయకుల నాయకులు ఆలోచించి సాంస్కృతిక సారథిలో జీతం తీసుకుంటున్న వారికి ప్రోగ్రాంలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని, స్థానికంగా ఉండే నిరుద్యోగ కళాకారులకు ప్రోగ్రామ్స్ ఇవ్వాలన్నారు. సాంస్కృతిక సారథి ఉద్యోగులకు ప్రోగ్రామ్స్ ఇవ్వొద్దన్నారు. ఒక వేళ ఎక్కడైనా ఈ ఎన్నికల ప్రచారంలో వాళ్ళు పాటలు పాడుతూ కన్పించినా లేదా ప్రోగ్రాం పట్టుకొని కమీషన్లకు ఇచ్చినట్టు తెలిసినా వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తప్పకుండా డిపిఆర్‌ఓకు, కలెక్టర్ కి ఫిర్యాదు చేసి వారిని సస్పెండ్ చేసేవరకు ఉరుకోమని నిరుద్యోగ ఉద్యమ కళాకారుడు వల్లపు స్వామి హెచ్చరించారు.

పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



నవతెలంగాణ-కోహెడ

రానున్న పార్లమెంటరీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ చేసిన అభివృద్ధి పనులే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తున్నాయన్నారు. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వంద రోజులు పూర్తయిన రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా వెంటనే రుణమాఫీ, ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం, వరిధాన్యానికి ఐదు వందల బోనస్ వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు, వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, సీనియర్ నాయకులు కొక్కుల సురేష్, ఆవుల మహేందర్, పూల బాలయ్య, రాజేశ్వర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, భీంరెడ్డి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ
- అదనపు కలెక్టర్ రమేష్‌కు వినతి

నవతెలంగాణ-మెదక్



గ్రామ పంచాయితీ సిబ్బంది పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ పేర్కొన్నారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేష్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ సిబ్బందికి గత 5 నెలలుగా ప్రభుత్వం వేతనాలను చెల్లించకపోవడంతో చాల అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర బడ్జెట్ ఉంటుంది కానీ గ్రామ పంచాయితీ సిబ్బందికి చెల్లించడానికి బడ్జెట్ లేదా అని ప్రశ్నించారు. పెద్దశంకరంపేట మండలంలో వేతనాలు రాక 10 నెలలు గడుస్తున్నదన్నారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న గ్రామ పంచాయితీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందన్నారు. గ్రామ పంచాయితీ కార్మికులే అసలైన సేవకులని, ప్రభుత్వం జీతాలు చెల్లించకుండా దుర్మార్గంగా ప్రవర్తిస్తుందన్నారు. ప్రతినెలా డబ్బులు, నూనెలు, బెల్లం ఇవ్వాలని, జీతాలు ప్రతినెలా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ నాటికి పెండింగ్ జీతాలు చెల్లిస్తేనే గ్రామ పంచాయితీ పరిధిలో పని చేస్తామని, లేకపోతే గ్రామ పంచాయితీ పనులు నిలిపి వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ జిల్లా కార్యదర్శి ఆసీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజుల్లో రూ. 88 కోట్లు

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదు
- మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



నవతెలంగాణ-మెదక్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 88 కోట్లను కేటాయించి పనులకు శ్రీకారం చుట్టినట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. బుధవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ గత పదేళ్ళ బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను బూతద్దంలో పెట్టి చూడాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. ఎక్కడ చూసినా అవినీతి లెక్కలు తప్ప అభివృద్ధిని చేసిన పాపాన పోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆరుగ్యారెంటీ పథకాల అమలుతో పాటు నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకుందన్నారు. మెదక్ నియోజకవర్గానికి ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ ద్వారా రూ. 15 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు, ఎస్డిఎఫ్ ద్వారా రూ. 10 కోట్ల అభివృద్ధి పనులతో పాటు మెదక్ పట్టణానికి టిఎస్‌ఎఫ్‌ఐడిసి ద్వారా 37.5 కోట్లు, రామాయంపేటకు రూ. 25.06 కోట్లతో అభివృద్ధి పనులను శంఖుస్థాపన చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణాలను సుందరీకరించుకునేందుకు అందమైన చౌరస్తాల నిర్మాణంతో పాటు మెదక్ పట్టణంలో పార్క్ నిర్మాణం, మెదక్ ఖిల్లాను అభివృద్ధి పర్చడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే మరింతగా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించుకోని మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మొట్టమొదటి స్థానంలో ఉంచుతామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీకి ఒక్కసీటు రాదని తెలిపారు. మెదక్ పార్లమెంట్ స్థానాన్ని ఇందిరాగాంధి గెలిచిన తరువాత తమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మెదక్ ఎంపి స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పార్టీ నేతలు

బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నేతలు ఎమ్మెల్యే రోహిత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ సమిఉద్దీన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, నాయకులు బొద్దుల కృష్ణ, గోధల సాయి, శ్రీధర్ యాదవ్, శాంసన్, వెంకటేష్ తదితరులు ఎమ్మెల్యే రోహిత్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులు దళారులను ఆశ్రయించవద్దు

- మెదక్ అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

రైతులు దళారులను ఆశ్రయించవద్దని, జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు (రెవెన్యూ) అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ (2023-24) ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలన్నారు. బుధవారం మండలంలోని శమ్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ తూకం చేయవద్దని ఆయన స్పష్టం చేశారు. రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని, రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు కొనుగోళ్లు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు వెంకటేశ్వర్లు వెల్లడించారు. టార్పాలిన్లు, తూకం వేసే యంత్రాలు ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం చూసే మెషిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట పౌరసరఫరాల అధికారులు బ్రహ్మ రావు, హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

రైతు వేదికలో వడ్ల కొనుగోలుపై ఆర్డీఓ సమీక్ష





నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలో బుధవారం రైతు వేదికలో కొనుగోలుదారులు, భాగస్వాములతో ఆర్డీఓ, తహశీల్దార్లు రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భాగంగా ఆర్డీఓ జై చంద్ర మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి ఏ రకమైన నష్టం వాటిల్లకుండా, రైతు పక్షంగా పని చేయాలని పేర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన 9 గ్రామ పంచాయతీల సెక్రెటరీలు, సీసీలు, ఈఓలకు రైతులు పండించిన పంటపై పలు అంశాలపై వారికి అవగాహన కొరకు పలు సూచనలు చేశారు. వడ్లు సెంటర్లో అమ్మకానికి వస్తున్న దృష్ట్యా వచ్చే సోమవారం వరకు మాయిశ్చర్ పరికరం వస్తుందని, కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన వడ్ల డాటా తొందరగా ఎంట్రీ జరగాలన్నారు. డాటాను కొనుగోలు కేంద్రంలో, రైస్ మిల్లు లలో, డీ ఎస్ ఓ వద్ద ఎంట్రీ త్వరగా జరిగితే రైతుల ఖాతాలలో డబ్బులు తొందరగా పడే అవకాశాలు ఉంటాయని సూచించారు. గతంలో కంటే ఈసారి తొందరగా వడ్ల కొనుగోలు జరగాలని సెక్రెటరీలకు, ఈఓ లకు, సీసీలకు ఆదేశించారు. వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి కాబట్టి వడ్లు తడవకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రంలోని టార్పోలిన్‌లు రైతుల వద్ద కొన్న వడ్లను పాడవకుండా, లారీలపై కప్పుకోవడానికి మాత్రమే అవకాశం ఉందని భావించాలని, ప్రతి రైతుకు టార్పోలిన్ ఇవ్వాలంటే అది సాధ్యం కాదని పేర్కొన్నారు. కేంద్రంలో రైతులకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలని గ్రామ సెక్రెటరీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ కరీం, ఎంపీఓ సతీష్ కుమార్, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సీసీలు, ఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఊరేగింపు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో బుధవారం పెద్దమ్మ తల్లి ఆలయంలో మొదటగా గణపతి పూజా కార్యక్రమాలను చేపట్టారు. గంగమ్మ తిపోత్సవము, పెద్దమ్మ తల్లిని గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు తీసి గ్రామస్తులకు కనుల విందు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఉత్సవాలు బుధవారం మొదలుకొని శనివారం వరకు జరుగుతాయన్నారు. పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణము, ఒగ్గు కథలు, గావు పట్టడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పంజ బాబు, కార్యదర్శి బాబురావు, పంజా గణేష్, కుల సంఘ పెద్దలు పంజా మహేందర్, సత్తయ్య, మాసుల సత్తయ్య, పున్న శ్రీనివాస్, మాసుల కర్ణాకర్, జీపి స్వామి, భానుప్రసాద్, పంజా నగేష్, పంజా ప్రశాంత్, సంఘ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని చిన్న చింతకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు వందమంది కార్యకర్తలు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డిలు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీ నుంచి నాయకులు భారీగా కాంగ్రెస్‌లోకి వస్తున్నట్లు వారు తెలిపారు. త్వరలో నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమన్నారు. అదేవిధంగా శివంపేట మండలం మాజీ ఎంపీపీ గోవింద నాయక్ సైతం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా, నాయకులు నవీన్ గుప్తా, సురేష్ నాయక్, అశోక్ గౌడ్, అశోక్, రామ గౌడ్ తదితరులు ఉన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవంలో గీతా విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-మనోహరాబాద్

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గత ఫిబ్రవరి 28న జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో తూప్రాన్ గీతా పాఠశాల విద్యార్థినులు పలు ప్రక్రియల్లో ప్రతిభ కనబరచి జిల్లా విద్యాధికారిచే ప్రశంసలు అందుకున్నారు. పదవ తరగతి విద్యార్థిని సాయి హర్షిణి సైన్స్ ఫేర్‌లో పాల్గొని జిల్లా స్థాయి ప్రథమ బహుమతితో పాటు రాష్ట్ర స్థాయిలో సైతం పాల్గొన్నారు. మరో విద్యార్థిని కె.మానస జిల్లా స్థాయి చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి సాధించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థిని శ్రీజ సైన్స్ ఫేర్‌లో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతిని సాధించారు. మరో విద్యార్థిని అన్వరి సైతం జిల్లా స్థాయి బహుమతి అందుకున్నారు. వీరికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మెమెంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, కె.నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటకృష్ణారావు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ సైన్స్ ఉపాధ్యాయులు సల్మా, హరికుమార్, సందీప్, కవిత, విజయన్, శ్రీనివాస్‌లు విద్యార్థినులను అభినందించారు.

స్వగ్రామంలో రఘునందన్ ఇంటింటి ప్రచారం

నవ తెలంగాణ- దుబ్బాక



బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి,మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు తన స్వగ్రామమైన అక్బరుపేట భూంపల్లి మండల పరిధిలోని బొప్పాపూర్ గ్రామంలో బుధవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు,మహిళలను ఆప్యాయంగా పలకరించారు.

నేపాల్ యాత్ర పుస్తక ఆవిష్కరణ

నవ తెలంగాణ - సిద్దిపేట



పట్టణంలోని పబ్లిక్ వెల్ఫేర్ సర్వెంట్స్ హోంలో డా.బి.సుధాకర్ రచించిన నేపాల్ యాత్ర పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన్ అధ్యక్షులు ఐత అంజయ్య ,సెక్రెటరీ విక్రం రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మధు సూదన్, కథాశిల్పి ఐత చంద్రయ్య , సీనియర్ జనరలిస్ట్ కొమరవెళ్లి అంజయ్య, కవి గంగాపురం శ్రీనివాస్ , పెందోట వెంకటేశ్వర్లు, భవన్ జీవిత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

2వ ఇంటర్ మెడికల్ కాలేజీ అథ్లెటిక్స్ పోటీలలో మహేష్ కు వెండి పతకం



నవ తెలంగాణ - సిద్దిపేట అర్బన్ : 2వ ఇంటర్ మెడికల్ కాలేజీ అథ్లెటిక్స్ పోటీలలో తతీయ సంవత్సరం చదువుతున్న మహేష్ వెండి పతకం సాధించాడని సురభి మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ రఫీ, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అద్వర్యంలో రెండవ ఇంటర్ మెడికల్ కాలేజీ అథ్లెటిక్స్ పోటీలు హన్మకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగాయని షాట్ పుట్ విభాగం లో వెండి పతకం సాదించాడని తెలిపారు. చదువుతో పాటు ఆటల్లోనూ అత్యంత ప్రతిభ కనబర్చినందుకు శాలువాతో సత్కరించి అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీఈఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ,సిఎఓ రామకృష్ణ, ఎ ఓ అమత్ పాల్ సింగ్, పీడీ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేండ్లలో నయా పైసా తేని బండి

- ఎంపీగా గెలిపిస్తే హుస్నాబాద్‌కు నవోదయ పాఠశాల తెస్తా
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎంపీ బండి సంజయ్ ఐదేండ్లలో కరీంనగర్ కు నయా పైసా తేలేదని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. బుధవారం హుస్నాబాద్ లోని ఎల్లమ్మ చెరువు కట్టపై మార్నింగ్ వాక్, ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసిందని ప్రజలకు వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాలుకు ఐదు వందల బోనస్ ఎప్పుడిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ ఏమైందని, రైతు భరోసా ఏదని ,రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని అన్నారు.నేను ఎంపీగా ఉన్న ఐదేళ్లలో జాతీయ రహదారులు,రైల్వేలైన్ తెచ్చానన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రతి ఏటా వచ్చే నిధులను బండి సంజయ్ తెచ్చినట్లు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలకు 9 మాత్రమే నవోదయ పాఠశాలలు ఉన్నాయని, ఐదేళ్లలో బండి సంజయ్ ఒక్క నవోదయ పాఠశాల తీసుకురాలేక పోయారని అన్నారు .ఎంపీ గా గెలిపిస్తే హుస్నాబాద్ కు నవోదయ పాఠశాల తెస్తానని హామీ ఇచ్చారు .ప్రజలు ఆశీర్వదించి ఈసారి ఎంపీగా గెలిపిస్తే ప్రశ్నించే గొంతునవుతాని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ అనిత, కౌన్సిలర్లు గోవిందు రవి, బొల్లి శ్రీనివాస్, సుప్రజ, గుళ్ల రాజు, రవిందర్ రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ సుధాకర్, మాజీ కౌన్సిలర్ సారయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డి, అక్కన్నపేట ఎంపీపీ లక్ష్మీబీలునాయక్, పార్టీ నాయకులు చిట్టి గోపాల్ రెడ్డి, విజయభాస్కర్, అరుణ్ కుమార్, మహిళ అధ్యక్షురాలు బండి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.



మాదిగల ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తాం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ

నవ తెలంగాణ- గజ్వేల్

పార్లమెంటు సీట్లలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో అంబెడ్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ,ఎం ఎస్ పి రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ,ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు పేర్కా పర్షా రాములు మాదిగ మాట్లాడుతూ..పార్లమెంట్ సీట్లలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందని, రేవంత్ రెడ్డి మాలలకు భయపడి తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసం మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మాదిగల మద్దతుతోనే నేను ఈ స్థాయికి ఎదిగిన అని,నా సొంత కులం నన్ను పట్టించుకోకపోయినా మాదిగలు మాత్రం నా ప్రతి ఎదుగుదలలో వెన్నంట ఉన్నారని అనేక వేదికల మీద మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు మాదిగలకు అవకాశాలను ఇవ్వకుండా అవమాన పరుస్తూ నమ్మకద్రోహానికి పాల్పడ్డార ని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం మాదిగలమంతా ఏకమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ ప్రకాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్క పల్లి రాజు, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్, శనిగరి రమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మనీ మహేష్,ములుగు మండల అధ్యక్షుడు కొక్కొండ నర్సింహులు, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల ఉపాధ్యక్షుడు , కోశాధికారులు బొంది స్వామి, భుర్కి ప్రశాంత్,ఎం ఎస్ పి జగదేవపూర్ మండల ఇంచార్జి కర్రోళ్ళ మల్లేష్ నాయకులు రాజు,తదితరులు పాల్గొన్నారు.



చెరువు మట్టి ఇటుకబట్టికి..?

-ఉపాధిహామీ పేరుతో అక్రమంగా తరలింపు..
-రైతుల పేరునా చెరువు మట్టి తరలింపుపై విమర్శలు
-అధికారులు దృష్టి సారించాలని పలువురి విజ్ఞప్తి

నవతెలంగాణ-బెజ్జంకి

రాత్రివేళల్లో చెరువు మట్టిని అక్రమంగా ఇటుక బట్టికి తరలిస్తున్నారని బుధవారం పలువురు ఆరోపించారు. మండల పరిధిలోని రేగులపల్లి గ్రామ శివారులోని మల్లం చెరువులో ఉపాధిహామీ పథకంలో సంబంధిత అధికారులు పనులు చేపట్టారు. చెరువు మట్టిని ఉపాధిహామీ పథకంలో స్థానిక రైతులు తమ వ్యవసాయ సాగు భూముల్లోకి తరలించుకోవడానికి అధికారులు అనుమతులిచ్చారు. ఇటుక బట్టి యాజమానులు రైతుల పేరునా మట్టిని మండల కేంద్రానికి తరలించుకుపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చెరువు మట్టి ఇటుక బట్టికి తరలివెళ్లకుండా సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల కళ్లు గప్పి...

చెరువు మట్టిని అధికారుల కళ్లుగప్పి పథకం ప్రకారం ఇటుక బట్టికి తరలించుకుపోవడం విస్మయానికి గురిచేస్తోంది.ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల్లో అధికారుల అదేశానుసారం ట్రాక్టర్ల యాజమానులు రైతుల వ్యవసాయ సాగు భూముల్లోకి తరలిస్తున్నారు.జన సంచారం, అధికారులు విధుల్లో లేని సమయంలో ఇటుక బట్టి యాజమానులు రైతుల వ్యవసాయ సాగు భూముల్లో నిల్వ చేసిన చెరువు మట్టిని యంత్రాల ద్వారా ఇటుక బట్టికి తరలిస్తున్నారని తెలిసింది.

మట్టి తరలింపుపై చర్యలు చేపడుతాం

ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల్లో అక్రమంగా తరలిస్తున్న చెరువు మట్టిపై నిఘా ఏర్పాటుచేసి తగు చర్యలు చేపడుతాం.

-జీవన్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి రేగులపల్లి

అసెంబ్లీ ఎన్నికల హామీలు అమలు చేయని కాంగ్రెస్

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామరెడ్డిని గెలిపించుకుందాం
బీఆర్ఎస్ లీగల్ సెల్ నేత కొట్టాల యాదగిరి ముదిరాజ్

నవ తెలంగాణ -గజ్వేల్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసి పార్లమెంటు ఎన్నికల్లో ఓటు అడగాలని బిఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర నేత, నాచగిరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 గ్యారంటీల అమలు పేరుతో ప్రజలను మరోసారి సీఎం రేవంత్ రెడ్డి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. అయితే ఇచ్చిన హామీ మేరకు పండించిన పంటలకు రూ 500 బోనస్ వెంటనే చెల్లించాలని, రూ రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోతున్నప్పటికీ సాగునీరు అందించక అన్నదాతల ఉసురు పోసుకుంటున్న ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆలాగే నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెస్ ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా వేయలేదని, అంతేగాకుండా తమ పార్టీ నేతలను మభ్యపెడుతూ, భయభ్రాంతులకు గురిచేసి, అక్రమ కేసులు బనాయిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నట్లు ఎద్దేవా చేశారు. అయితే ఈ ప్రాంత అభివృద్ధికి శ్రమించిన బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని తెలిపారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ, రంగనాయక సాగర్ తదితర ప్రాజెక్టుల నిర్మాణంతో బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని, నిర్వాసితులకు సైతం పూర్తి స్థాయిలో న్యాయం చేసినట్లు చెప్పారు. అవగాహన లేని కాంగ్రెస్, బిజెపి పార్టీల నేతలను నమ్మి మోసపోవద్దని, అభివృద్ధిపై పూర్తి అవగాహన కలిగిన కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో మెదక్ తో పాటు 15 పార్లమెంటు స్థానాలను దక్కించుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు రాజు, గణేష్, భగవాన్, యాదగిరి, భాస్కర్, మల్లికార్జున్, పాండు, చందు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



నేడు అలయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నవ తెలంగాణ - సిద్దిపేట

అలయన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లా10వ నూతన కమిటీ ప్రమాణస్వీకారం గురువారం ఉదయం 10 గంటలకు వైశ్య భవన్‌లో ఉంటుందని అలయన్స్ క్లబ్ ప్రతినిధి ఆత్మ రాములు తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల క్రితం అలయన్స్ క్లబ్ జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదలకు, పేద విద్యార్థులకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని, నిరుపేదలైన అమ్మాయిల పెళ్లిలను సంప్రదాయ బద్ధంగా అన్ని తమ ఖర్చులతో చేస్తున్నట్లు తెలిపారు. మరో ప్రతినిధి వైకుంఠం మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ సేవా కార్యక్రమాలతో పాటు ఐ బాల్ కలెక్షన్, రక్తదాన శిబిరాలు నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. జిల్లా గవర్నర్ బాలచంద్రం మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. రేపు జరుగు నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బాలచంద్రన్, బాలగంగాధరశాస్త్రి, వి ఎం రావు లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అలయన్స్ క్లబ్ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, అలయన్స్ సభ్యులు ఈశ్వర్ చరణ్, రామచంద్రం, వనజ, సుజాత, సత్యనారాయణ, రాజేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.



కేసీఆర్‌ను కలిసిన పలువురు నేతలు

నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు కేసీఆర్‌ను మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా మధ్యాహ్నం నుండి రాత్రి వరకు గజ్వేల్ నియోజకవర్గం చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మర్కుక్ మండలం ఎర్రవల్లి తన వ్యవసాయ క్షేత్రంలో పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి దగ్గర ఉండి ప్రతి నాయకుడిని కెసిఆర్ కు పరిచయం చేయించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మొదటి వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు కలిసి అంబేద్కర్ చిత్రపటాన్ని అందించారు. అదేవిధంగా మాజీ కౌన్సిల్ సభ్యులు కళ్యాణ్కర్ శ్రీనివాస్, ఆర్క్ శ్రీనివాస్, బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా నేతలు కరీం, నవాజ్ , బాకీ స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కెసిఆర్ పార్లమెంటు ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గం లో అందరూ కలిసి పనిచేసే పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ తీసుకురావాలని వారికి చెప్పినట్లు స్థానిక నేతలు తెలిపారు.



ధరణి భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- పెండింగ్ లో ఉన్న ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి భూసమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రూ.17 వేలకు పైగా ధరణి భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇవి అత్యధికంగా సన్న చిన్నకారు రైతులవేనన్నారు. ధరణి సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారు. స్పెషల్ డ్రైవ్ పెట్టిన ధరణిలో రైతుల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చర్యలు తీసుకొని ధరణి సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ఉపాధి హామీ ఎనిమిది నెలల బకాయిలు కూలీలకు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీ కూలీలకు నీళ్లు, టెంట్ కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా నీళ్లను తరలిస్తున్న వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు యం.నర్సింలు, నాయకులు రాజయ్య, బి.నర్సింహారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాజీపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-జిన్నారం : మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన కాజీపల్లిలో తహశీల్దార్ బిక్షపతి ఆదేశాల మేరకు 181 సర్వే నంబర్ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను ఆర్ఐ జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో కూల్చి వేశారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ జయప్రకాష్ నారాయణ హెచ్చరించారు.



సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తాం

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్



సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులో ఉండి అందిస్తున్నామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో నర్సారెడ్డి ఇంటిలో ములుగు మండలానికి చెందిన మాజీ సర్పంచులు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం జరుగుతుందని ఆశించి వివిధ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటని ఆయన చెప్పారు. గజ్వేల్లో కాంగ్రెస్కు పూర్వ వైభవం రావడం ఖాయం అన్నారు. మూడుసార్లు వేసి పట్టం కట్టిన గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం విడ్డూరం అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటే గౌరవంగా ఉంటుందని ఆయన చెప్పారు. ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం లో తాగునీరు సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పాత బోరు బావులను బాగు చేస్తుందన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పనులను చేపడతామన్నారు. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరికీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

చలివేంద్రాలు ఎంతో ఉపయోగం

నవతెలంగాణ- గజ్వేల్



చలివేంద్రాలు ప్రజలకు ఎంతో దాహార్తి తీర్చుతున్నాయని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో ఏఎస్ఆర్ ట్రావెల్స్ అధినేత లయన్ అమర్ నాగేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గత దశాబ్దాల కాలంగా ఏఎస్ఆర్ ట్రావెల్స్ వేసవిలో చలివేంద్రాలు, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకు వేసవిలో కొంత ఉరట కలిగిస్తుందని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ వేసవి కాలంలో ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేశారన్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్, స్నేహ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వేసవికాలం పూర్తయ్యే వరకు నిర్వహిస్తామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఎన్నార్ ట్రావెల్స్ అధినేత అమర నాగేందర్, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆర్కే రాధాకష్ణ, సిద్దిపేట జిల్లా వాలిబాల్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ , లైన్స్ క్లబ్ సభ్యులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దుద్దెడలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం


నవ తెలంగాణ - కొండపాక



కొండపాక మండలం దుద్దెడలోని ఓ ఫంక్షన్ హాల్ లో గురువారం 10 గంటలకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల అధ్యక్షుడు నూనె కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగే సమావేశానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి వెంకట్ రామ్ రెడ్డి , ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్ డి సి మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన హరీశ్ రావు

నవ తెలంగాణ - సిద్దిపేట



ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలను ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో ఒకటి రంజాన్ అని అన్నారు. చెడు భావనల్ని, ఆధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు. కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణ వారిదన్నారు.

దేవులపల్లి రమేశ్ కు ఉగాది పురస్కారం

నవతెలంగాణ -నంగునూరు



సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన రచయిత దేవులపల్లి రమేశ్ ఐ.ఎస్.ఓ గుర్తింపు పొందిన ఉగాది పురస్కారం అందుకున్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని 150వ జూమ్ సమావేశం చేపట్టారు.సాహిత్య రంగంలో విశిష్ట సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో రచయిత దేవులపల్లి రమేశ్ ను అభినందించారు. తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక అధ్యక్షులు మూర్తి నారాయణరావు, దాలి నాయుడు ఎంపిక చేశారు. అంతర్జాలం ద్వారా పంపిన ఉగాది పురస్కారంను దేవలపల్లి రమేశ్ అందుకున్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

కౌన్సిలర్స్ నాయకం లక్ష్మణ్, ఏడ్ల అరవింద్ రెడ్డి



నవ తెలంగాణ - సిద్దిపేట

వేసవికాలం ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పట్టణ కౌన్సిలర్స్ నాయకం లక్ష్మణ్, ఏడ్ల అరవింద్ రెడ్డి అన్నారు. ఫెర్టిలిటీ, లాప్రోస్కోపిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, రైతు బజార్ వద్ద చలివేంద్రాలను కౌన్సిలర్లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపాదించిన దాంట్లో కొంత సేవ కోసం వినియోగించడం అభినందనీయమని అన్నారు. ఫెర్టిలిటీ ఆసుపత్రి వారు రోగులకు సేవ చేయడమే కాకుండా, పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం చల్లటి నీటిని అందించడం పుణ్యం అని అన్నారు. వేసవిలో మంచి నీటిని అందించడమే గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో దుద్దెడ మాజీ సర్పంచ్ మంచాల శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ నాయకులు ప్రకాశ్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం మహా దానం

నవ తెలంగాణ- గజ్వేల్



నేత్రదానం మహా దానం అని నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ అన్నారు బుదవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య నాయకులు గోలి కృష్ణమూర్తి మాతృమూర్తి కళావతి (90) బుధవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కళావతి నేత్రాలు దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం తో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో గజ్వేల్ ఐ కేర్ హాస్పిటల్ వారు ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ నేత్ర దానం మహా దానం అని ఒకరి కళ్ళ దాదాపు ఎనిమిది మందికి కంటి చూపు భాగ్యం కలుగుతుందని నేత్ర దానం కోసం ముందుకు వచ్చిన కళావతి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ కిరాణా అడిసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి,కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, అయ్యప్ప దేవాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి రవీందర్,ఆర్యవైశ్య సీనియర్ నాయకులు శ్రీహరి, ఛఖిలం కష్ణమూర్తి, నోముల మహేందర్,బిక్షపతి, దూబకుంట ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు..

అక్కడిక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి, మరోకరికి గాయాలు

నవతెలంగాణ-బెజ్జంకి




అదుపుతప్పి కారు చెట్టును ఢీకొట్టడంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందగా మరోకరు గాయపడిన సంఘ టన మండల పరిధిలోని బేగంపేట గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం గూడెం గ్రామానికి చెందిన హన్మండ్ల సందీప్ రెడ్డి(29) వర్క్ ప్రమ్ హెూం విధానంలో సాఫ్ట్ వేర్ గా పని చేస్తున్నాడు.మంగళవారం సందీప్ రెడ్డి వడ్లూర్ గ్రామానికి చెందిన పొట్ల రాజుతో కలిసి లక్ష్మీపూర్ గ్రామంలో బంధువులను కలిసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బేగంపేట గ్రామ శివారులోని మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢికొట్టారు.ఈ ఘటనలో వాహనం నడుపుతున్న సందీప్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా రాజుకు గాయాలయ్యాయి.స్థానికులు గమనించి గాయాలైన రాజును చికిత్స కోసం కరీంనగర్ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.మృతుడి తండ్రి రామచంద్ర రెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

నవ తెలంగాణ - మిరుదొడ్డి



మిరుదొడ్డి మండల కేంద్రంలో నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్గనైజేషన్ చైర్మన్ ఐలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలంలో పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అను వాటర్ ప్లాంట్ సౌజన్యంతో వర్షాకాలం వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. వేసవి కాలంలో వివిధ గ్రామాల నుండి మిరుదొడ్డి మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భైరయ్య, రమేష్ , చందు , రాజయ్య, పర్శ రాములు, సాయి,తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ- దుబ్బాక: పురపాలిక కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈఓ ఎం.మోహన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుబ్బాక పట్టణ, పరిసర ప్రాంతాల రైతులు తమ ధాన్యాన్ని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు.పీఏసీఎస్ సిబ్బంది కరుణాకర్,ఏఎంసీ సిబ్బంది గణేష్,పలువురు పాల్గొన్నారు.

ఈద్ ముబారక్..

- నేడే పవిత్ర రంజాన్ పండుగ



నవతెలంగాణ-బెజ్జంకి

ఉపవాసము,ప్రార్థనలు,దానధర్మాలతో నెల రోజుల పాటు నియమనిష్టలతో గడపడమే రంజాన్ మాసం ప్రత్యేకత. ముస్లిం సోదరిసోదరులు ఈమామ్, నమాజ్, రోజా,జకాత్, హాజ్ అనేవి ముస్లిం మతానికి మూలసూత్రములు.రంజాన్ మాసంలో ముస్లిం సోదరిసోదరులు సూర్యోదయం అయ్యాక ఉపవాసం ప్రారంభించి సూర్యాస్తమయం అయ్యాక ఉపవాసాలను విరమిస్తారు.పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తి ప్రవత్తులతో ముస్లింలు రంజాన్ పండుగను అత్యంత పవిత్రంగా జరుపుకుంటారు.ద్వేషాలన్నీ సమసి ప్రేమపూరిత భావం ఇనుమడిస్తుంది. రంజాన్ పండుగ.మానవుల మధ్య నెలకొన్న వర్గ వైషమ్యాలు తొలగించి అందరిలో ఆధ్యాత్మిక చింతన కలిగించి చిరుజీవితాన్ని ఆనందంతో నింపి పుణ్యకార్యాల వైపు దృష్టి మరల్చే రమదాన్ మాసం చైతన్యాన్ని కలిగించి ముందుకు సాగే ధైర్యాన్నిస్తుంది.ముస్లింలే కాక ముస్లిమేతర సోదరులు కూడా కలిసి అలింగనం చేసుకుంటూ పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది కవి సమ్మేళనం



నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మల్లినాధసూరి తెలుగు శాఖ, జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి.హెచ్ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సంవత్సరం ప్రకృతి కొత్తదనం నింపుతూ నూతనత్వం పంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట బడిపిల్లల పుస్తక పరిచయం జరిగింది. సుమారు 30 మంది సిద్దిపేట కవులు, కళాశాల విద్యార్థులు కవితాగానం చేశారు. ఉగాది పచ్చడితో షడ్రుచులు అస్వాదించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెళ్ళి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తెలుగు విభాగం అధ్యక్షులు మహేందర్, మహేందర్ రెడ్డి, కవులు మాడుగుల మురళీధరశర్మ, పప్పుల రాజిరెడ్డి, శ్రీనివాస్, బస్వ రాజ్ కుమార్, శివకుమార్, సరస్వతీ, లక్ష్మీ, జలజారాణి, మాధవీలత, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

యువభేరి సభను విజయవంతం చేయాలి

- బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి చేపూరి శేఖర్ గౌడ్



నవతెలంగాణ - దౌల్తాబాద్

ఈ నెల 13 న దౌల్తాబాద్ లో జరిగే నియోజకవర్గ యువ భేరీ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి చేపూరి శేఖర్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షుడు పాపని సురేష్ గౌడ్,మండల యువజన అధ్యక్షుడు నర్ర రాజేందర్,బిఆర్ఎస్వి నాయకులు సయ్యద్ ఖలీలొద్దిన్,కెంసారం నాగరాజు,సల్ల స్వామి,సురేష్,జలంధర్,ప్రకాశ్, గొల్ల శేఖర్,సతీష్,నరేష్,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల సాయిలుకు సన్మానం



నవతెలంగాణ-మద్దూరు

కాంగ్రెస్ పార్టీ దూల్మిట్ట మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్ ను కొండాపూర్ గ్రామానికి చెందిన కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ పాల్య శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మంద శ్రీనివాస్, పేర బోయిన రాజు, వడ్లూరి వంశీ, పాల్య రమేష్, పేరం కనకయ్య, తదితరులు పాల్గొన్నారు

గోటి తలంబ్రాల కార్యక్రమం అద్భుతం

- గజ్వేల్ సీ ఐ సైదా




నవతెలంగాణ- గజ్వేల్

సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు గోటి తలంబ్రాల కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగ స్వాములను చేయడం అద్భుతమని గజ్వేల్ సిఐ సైదా అన్నారు. బుధవారం సిఐ సైదా చేతుల మీదుగా పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులకు గోటి తలంబ్రాలు అందజేశారు. భద్రాచల సీతారాములు కళ్యాణంలో పాలు పంచుకునే అవకాశం ఈ గోటి తలంబ్రాల వల్ల మాకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, ఎస్ఐ యాదగిరి, ఏఎస్ఐ పండరీ గోపాల్ గౌడ్, హెచ్ సి జగన్ మోహన్ రెడ్డి, అమరెందర్ పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన మద్దూరు పోలీసులు

నవతెలంగాణ-మద్దూరు



పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మద్దూరు ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ ఆదేశాల మేరకు మద్దూరు మండల కేంద్రంలో ఏఎస్ఐ జిల్లా జగదీష్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుల్ రవి, అనిల్ కుమార్, సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు

తైబజార్ వేలం అదాయం రూ.9,21,100



నవతెలంగాణ-బెజ్జంకి

ఈ నెల 15 నుంచి 30 వరకు నిర్వహించనున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సావాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.బ్రహ్మోత్సాలలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల అవరణంలో ఆలయ ఈఓ విశ్వనాథ శర్మ అధ్వర్యంలో తైబజార్ వేలం పాట నిర్వహించారు.తైబజార్ వేలం ద్వారా ఆలయానికి సుమారు రూ.9,21,100 అదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.ఉత్సవ కమిటి సభ్యులు జెల్లా ప్రభాకర్,బర్ల రాజు,బోనగిరి ప్రభాకర్,గుభిరే స్వప్న,బెజుగం స్వప్న,ఐలేని శ్రీనివాస్ రెడ్డి,దోనే శ్యాం,మాజీ చైర్మన్ బండారి రాములు,ద్యావనపల్లి శ్రీనివాస్,ఆలయ ఉద్యోగులు,గ్రామస్తులు హజరయ్యారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్ స్వాధీనం





నవతెలంగాణ-రాయపోల్

నిరుపేద ప్రజలు కడుపునిండా మూడు పూటలా అన్నం తినాలని సదుద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తే కొంతమంది అక్రమార్కులు వ్యాపారం చేస్తున్నారని రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి అన్నారు. మంగళవారం రాత్రి అంకిరెడ్డిపల్లి, వడ్డేపల్లి గ్రామాలలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో తనిఖీలలో భాగంగా పుట్టగూడెం గ్రామం, రాజాపేట మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మదావత్ నామ్ తన వాహనంలో 38 క్వింటాళ్ల రేషన్ బియ్యం, పుట్టగూడెంకు చెందిన మానవత్ నితిన్, భూక్య రమేష్ నెంబర్ లేని తన వాహనంలో 28 క్వింటాళ్ల రేషన్ బియ్యం, తుర్కపల్లికి చెందిన నూనెవత్ బిచ్చు తన వాహనంలో 14 క్వింటల్లా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పై నలుగురు వ్యక్తులు మూడు వాహనాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా రాయపోల్ మండలంలోని వివిధ గ్రామాలలో తక్కువ రేటుకు ప్రభుత్వ రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు అమ్ముదామని అక్రమంగా వాహనాలలో తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు వారిని వాహనాలను పట్టుకున్నట్టు తెలిపారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గ్రామాలలో, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఏఎస్ కృష్ణంరాజు పోలీస్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనం తీసుకుంటున్న కళాకారులకు ప్రోగ్రాంలు ఇవ్వొద్దు

- తెలంగాణ రాష్ట్ర కళా వేదిక రాష్ట్ర కార్యదర్శి బండకాడి గణేశ్



నవతెలంగాణ-తొగుట

సాంస్కృతిక సారథిలో వేతనం తీసుకుంటున్న కళాకారులకు పార్టీల ప్రచారాల ప్రోగ్రాంలు ఇవ్వొద్దని తెలంగాణ రాష్ట్ర కళా వేదిక రాష్ట్ర కార్యదర్శి బండకాడి గణేశ్ అన్నారు. బుధవారం విలేకరుల తో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు నుండి నేటి వరకు కలనే నమ్ముకొని, పాటనే జీవన బాటగా ఎంచుకొని బతుకుతున్న కళాకారుల నోట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మట్టి కొట్టిందన్నారు. డిపిఆర్వో నుండి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కళాకారులకు నెలకు 15 రోజుల పని కల్పించేది అని గుర్తు చేశారు. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు గౌరవం అని చెప్పి సాంస్కృతిక సారథి పేరుతో వాళ్లకు నచ్చిన వారికే ఉద్యోగాలు కల్పించారని అన్నారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా 550 మందికి నెలకు రూ. 25 వేల వేతనం ఇస్తు కేవలం వారితోనే సంక్షేమ పథకాలు ప్రచారం చేయిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలమంది కళాకారుల బతుకులు బజారుపాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకు దెరువు కొరకు అక్కడనో, ఇక్కడ నో ఏవైనా ప్రైవేట్ ప్రోగ్రాంలు చేసుకొని బతుకుతున్న నిరుద్యగ కళాకారులకు సారథి కళాకారులే పెద్ద శత్రువులుగా మారుతున్నారని ఆరోపించా రు. ప్రభుత్వం నుండి వచ్చిన వేతనం సరిపోలేద న్నట్లు, మళ్ళీ ప్రైవేట్ ప్రోగ్రాంలు రాజకీయ పార్టీలు చేసే ప్రచారాల ప్రోగ్రాంలాల్లో కూడా అడ్డుపడి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులతో ఎక్కువ డబ్బులు మాట్లా డుకొని మళ్ళీ మా నిరుద్యోగ కళా కారులకు కమీ షన్ లకు ఇచ్చి చేయిస్తున్నారని అన్నారు. అక్కడ వారే, ఇక్కడ వారే, రికార్డింగ్ లో వారే ఇగ ఉద్యోగం రాని నిరుద్యోగ కళాకా రులు బతకకుండా చేస్తున్నా రని చెప్పారు. కాబట్టి దయచేసి రాజకీయ పార్టీల నాయకులు ఆలోచించి సాంస్కృతిక సారథిలో జీతం తీసుకుంటున్న వారికి మీరు ప్రోగ్రాంలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని, ఒక వేళ ఎక్కడైనా ఈ ఎన్నికల ప్రచా రంలో వాళ్ళు పాటలు పాడుతూ కన్పించినా, ప్రోగ్రాం పట్టుకొని కమీషన్లకు ఇచ్చి నట్టు తెలిసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. డిపిఆర్ఓ, జిల్లా కలె క్టర్ కు పిర్యాదు చేసి వారిని సస్పెండ్ చేసేవరకు ఉరుకునే ప్రసక్తే లేదన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ- రాయపోల్

మద్యానికి బానిసై జీవితం మీద విరక్తి చెంది వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాంసాగర్ గ్రామానికి చెందిన కిచ్చుగారి మల్లేశం (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఐదు సంవత్సరాల క్రితం మల్లేశం భార్య కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు నర్సింలు, గణేష్ ఉండగా హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్య చనిపోయిన నాటినుంచి మల్లేశంకు మద్యం సేవించడం అలవాటయింది. కుటుంబ సభ్యులు మద్యం సేవించడం ఆపేయాలని హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం పెద్ద కుమారుడు కిచ్చుగారి నర్సింలు మేడ్చల్ నుండి సొంత గ్రామం రాంసాగర్ వచ్చారు. తండ్రి కొడుకులు రాత్రి 10:00 సమయం వరకు మాట్లాడుకున్నారు. కొడుకు నర్సింలు పెదనాన్న ఇంటిదగ్గర పడుకోవడానికి వెళ్ళాడు. ఉదయం నిద్రలేచి ఇంటికి వచ్చి చూసేసరికి మల్లేశం ఇంటి తలుపులు తెరవలేదు. ఎన్నిసార్లు పిలిచినప్పటికీ తెరవకపోయేసరికి అనుమానంతో కిటికీ పగలగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి మల్లేశం ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఇట్టి విషయాన్ని పోలీసుల కు సమాచారం అందించడంతో మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించా రు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోలు ఎస్సై రఘుపతి తెలిపారు.

13న బీఆర్ఎస్ యువభేరి సభ

- రాష్ట్ర యువజన నాయకులు తీపిరెడ్డి మహేష్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

ఈనెల 13న దౌల్తాబాద్ లో జరిగే బీఆర్ఎస్ యువ భేరి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర యువజన నాయకులు తీపిరెడ్డి మహేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ యువ నాయకులతో ఆయన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ ఎన్నికల్లో మాజీ కలెక్టర్ వెంకట్రామి రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈనెల 13న జరిగే యువగర్జన సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి వారికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్, బీఆర్ఎస్వి అధ్యక్షులు అరుణ్ కుమార్, నంట పరమేశ్వర్ రెడ్డి, నాయకులు బండారు రమేష్ గౌడ్, అనిల్ కుమార్, సురేష్ గౌడ్, స్వామి, రాజశేఖర్, బోయిని బాలరాజు, నేవూరి కరుణాకర్ రెడ్డి, మహేష్, బాలరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగను సంతోషంగా చేసుకోవాలి

- సిద్దిపేట మూడో వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట, సిద్దిపేటఅర్బన్

అల్లా దయతో రంజాన్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సిద్దిపేట మూడో వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి ఆకాంక్షించారు. రంజన్ పండుగను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని మూడో వార్డులో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా (కానుక) లను కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి పంపిణీ చేశారు. ముస్లింల అభ్యున్నతికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు దబ్బెట శ్రీనివాస్, పొట్లచెర్వు ఆంజనేయులు, నిమ్మ మహేందర్ రెడ్డి, ఇరేణి మల్లేశం, నరేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాత వెంకటేశ్వర దేవాలయంలో పంచాంగ శ్రవణం



నవతెలంగాణ - సిద్దిపేట

వాసవి క్లబ్ యూత్, వెంకటేశ్వర సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పండుగ పురస్కరించుకొని స్థానిక పాత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం సాయంత్రం కలకుంట్ల వెంకట నరసింహచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విసిఐ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్, వెంకటేశ్వర స్వామి సేవ సమితి అధ్యక్షులు మంకాల నవీన్ కుమార్, వాసవి క్లబ్ యూత్ ప్రెసిడెంట్ అరవపల్లి హరి కిరణ్, క్లబ్ సభ్యులు గంప కృష్ణమూర్తి, గౌరీ శంకర్, యాద శ్రీనివాస్, బిక్షపతి, శ్రవణ్, సంతోష్, భాస్కర్, దుర్గయ్య, గంగాధర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు

- ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్



నవతెలంగాణ-రాయపోల్

ఈద్-ఉల్-ఫితర్ (పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణ వారిదిన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేర్యాల పట్టణ, మండల అధ్యక్షులకు సన్మానం



నవతెలంగాణ-చేర్యాల

నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ చేర్యాల పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు మంచాల చిరంజీవులు, కొమ్ము రవి లను బుధవారం ఆకునూరు గ్రామ శాఖ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకునూరు గ్రామ శాఖ అధ్యక్షులు బంగ్ల రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు ము స్త్యాల తారా యాదగిరి, చెవిటి లింగం, నాయకులు నీలం సన్నీ, ఎండి హైమద్, ఉపేందర్, ఎర్రోళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న స్థావరంపై పోలీసుల దాడి

- రూ.34వేల 890 నగదు, 5 ఫోన్లు స్వాధీనం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణంలోని శ్రీ మల్లికార్జున క్లినిక్ లో బుధవారం పట్టణానికి చెందిన కొంతమంది జూదం ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో సిద్దిపేట జిల్లా టాస్క్ ఫోర్స్, చేర్యాల పోలీసులు కలిసి జూదం ఆడుతున్న స్థావరంపై దాడి చేశారు. జూదం ఆడుతున్న చిలుకూరి రమేష్, ఏను శెట్టి అమర్నాథ్, బుడిగె శ్రీధర్, ఉప్పులూరి శ్రీధర్, మోటు గౌరీనాథ్ అనే వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి ఐదు సెల్ ఫోన్లు, 34,890 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎవరైనా వ్యక్తులు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ప్రజాబలంతో గెలవాలి



నవతెలంగాణ- రాయపోల్


ఆర్మీ కుటుంబాలు నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిని చేయడానికి మద్దతుగా నిలవాలని రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రం అన్నారు.బుధవారం రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మహేష్ కుటుంబాన్ని కలిసి సన్మానం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాబలంతో గెలిచి పరిపాలన చేపట్టాలి కానీ ధన బలంతో ఎన్నికలలో గెలవద్దన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ అధికారులను బలి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డిపల్లి బిజెపి భూత్ అధ్యక్షులు యాదగిరి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుకునూరుపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ - కొండపాక

కుకునూరుపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్ లో గురువారం 12 గంటలకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుందని పిఏసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగే సమావేశానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్ డి సి మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

పూలే జయంతి సందర్భంగా గేయం



నవతెలంగాణ-తొగుట

తే.గీ
సంఘసంస్కర్త బహుజన సారథిగను
ప్రబలె, బాల్యవివాహాలు రద్దు పరచి
సతిసహగమనమును నాపి స్తుతమతిగను
జ్యోతిరావు పూలేగారు ఖ్యాతి వడసె

కం.
పడతులు జదువక నున్నను
పుడమి పురోగమనమెల్ల పూజ్యంబనుచున్
పడతులు జదువగతానే
బడులను నిర్మించినట్టి ప్రాజ్ఞుండతడున్

కం.
ధీకొని యస్పృశ్యత తా
కూకటి వ్రేల్లను బెకల్చి గుణవంతుడుగా
లోకములో విరజిల్లిన
ప్రాకటమైనట్టి జ్ఞాని వసధను పూలే!!

ఆ.వె
అంటరాని వారి కగ్రకులస్తులు
చదువు జెప్పమనుచు సమ్మె సేయ
సతిని బంపినాడు చదువు జెప్పగ జేసి
సట్టివాడు కద మహాత్మపూలె

కం..
రవివల్లను జగతి వెలుగు
కవివల్ల సమాజమునను కదలిక బెరగున్
రవికవి కన్నను మిక్కిలి
స్తవనీయుడు ధరణిసంఘ సంస్కర్తయగున్

సహజకవి, అష్టావధాని
బండకాడి అంజయ్య గౌడ్